అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శుక్రవారం 29, మే 2026 | సంపుటి :03 | సంచిక :110 | పేజీలు :05 | వెల ₹5

త్రివేణి తీరాన

సరస్వతి

వైభవం

05

02

- నిర్మాణ పనులు తుది దశకు..
- త్వరలోనే అందుబాటులోకి 'మెగా రోలింగ్ స్టాక్ యూనిట్'
- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

కాజీపేట కేంద్రంగా దేశీయ రైల్వే విప్లవం

ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీ

తెలంగాణలోనే కాకుండా దేశ రైల్వే రంగానికే తలమానికంగా మారుతున్న హనుమకొండ జిల్లాలోని కాజీపేట రైల్వే తయారీ యూనిట్ త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ఈ ప్రతిష్టాత్మక మెగా ఫ్యాక్టరీలో రానున్న ఐదేళ్లలో 200 అత్యాధునిక ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేయనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం వెల్లడించారు. రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్ నీత్ సింగ్ బిట్టూ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కాజీపేట యూనిట్ కార్యాచరణ ప్రణాళికలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాజీపేట తయారీ యూనిట్ పనులు ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయని, ఇది బహుళ ప్రయోజనకరమైన రోలింగ్ స్టాక్ తయారీ కేంద్రంగా దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోబోతోందని స్పష్టం చేశారు.

- అక్షరదర్బార్, కాజీపేట

సమగ్ర సంక్షేమ కార్డు

- తద్వారా ఒకేచోట ప్రతి పౌరుడి సంక్షేమ ప్రొఫైల్
- అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

02

డెడ్ లైన్ జూన్ 4

ఆ లోగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు పూర్తి చేయాలి

- గన్నీ సంచుల కొరత లేదు.. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం
- తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొంటాం.. మిల్లర్లు కటింగ్ పెడితే కఠిన చర్యలు
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష

03

కాజీపేట కేంద్రంగా దేశీయ రైల్వే విప్లవం

- ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీ
- నిర్మాణ పనులు తుది దశకు.. త్వరలోనే అందుబాటులోకి 'మెగా రోలింగ్ స్టాక్ యూనిట్'
- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

అక్షరదర్బార్, కాజీపేట: తెలంగాణలోనే కాకుండా దేశ రైల్వే రంగానికే తలమానికంగా మారుతున్న హనుమకొండ జిల్లాలోని కాజీపేట రైల్వే తయారీ యూనిట్ త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ఈ ప్రతిష్టాత్మక మెగా ఫ్యాక్టరీలో రానున్న ఐదేళ్లలో 200 అత్యాధునిక ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేయనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం వెల్లడించారు. రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కాజీపేట యూనిట్ కార్యాచరణ ప్రణాళికలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాజీపేట తయారీ యూనిట్ పనులు ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయని, ఇది బహుళ ప్రయోజనకరమైన రోలింగ్ స్టాక్ తయారీ కేంద్రంగా దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోబోతోందని స్పష్టం చేశారు.

కాజీపేట ఇంటర్ సిటీ రైళ్ల ప్రత్యేకతలు ఇవే

దేశవ్యాప్తంగా దాదాపు 300 కిలోమీటర్ల లోపు దూరం ఉండే పొరుగు పట్టణాలు, నగరాలను కలుపుతూ ఇవి 'షటిల్ సర్వీసులు'గా నడుస్తాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ వ్యాపారులు, రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రైళ్లకు ఎక్కువ స్టాపింగ్‌లు ఇస్తారు. దీనివల్ల రోడ్డు రవాణాపై ఒత్తిడి తగ్గి, ప్రయాణికులకు సురక్షితమైన, చౌకైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. ప్రతి ఇంటర్ సిటీ రైలు 20 కోచ్‌ల సామర్థ్యంతో నడుస్తుంది. ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్ సిస్టమ్, అత్యుత్తమ వెంటిలేషన్, ప్రయాణంలో కుదుపులు లేని 'జెర్క్ ఫ్రీ' కప్లర్లు, అత్యాధునిక బోగీలను అమర్చుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి కోచ్‌కి ఇరువైపులా (రెండు చివరలా) టాయిలెట్ సౌకర్యం ఉంటుంది. ఈ రైళ్లను గరిష్టంగా గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేస్తున్నారు.

పర్యావరణ హితం – గ్రీన్ ఎనర్జీ

ఈ రైళ్లలో అత్యంత ఆధునికమైన 'రీజెనరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్'ను వాడుతున్నారు. అంటే.. రైలుకు బ్రేకులు వేసిన ప్రతిసారీ అది విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, తిరిగి గ్రిడ్‌కు సరఫరా చేస్తుంది. దీనివల్ల ఇంధన సామర్థ్యం పెరగడమే కాకుండా, కర్బన ఉద్గారాలు తగ్గి పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది.

ఓరుగల్లు వాసుల 40 ఏళ్ల కల సాకారం

దాదాపు రూ.500 కోట్ల భారీ పెట్టుబడితో అయోధ్యపురం వద్ద నిర్మితమవుతున్న ఈ మెగా ఫ్యాక్టరీ వల్ల వరంగల్, హనుమకొండ పరిసర ప్రాంతాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి లభించనుంది. తొలి దశలో వ్యాగన్లు, ఇంటర్ సిటీ రైళ్లతో ప్రారంభించి, భవిష్యత్తులో వందే భారత్ కోచ్‌లు, మెట్రో రైళ్లు, ఇంజన్లను కూడా ఇక్కడే తయారు చేసేలా ఈ యూనిట్‌ను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో (రోబోటిక్ పెయింటింగ్‌తో సహా) తీర్చిదిద్దుతున్నారు.

త్యాగానికి, ప్రేమకు ప్రతిరూపం బక్రీద్

- మంత్రి కొండా సురేఖ

అక్షరదర్బార్, వరంగల్: మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఎల్బీనగర్, మట్టేవాడ, ఫోర్ట్ వరంగల్ ఈద్గాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి కొండా సురేఖతో పాటు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులు మంత్రి కొండా సురేఖ, కొండా మురళీధర్ రావును శాలువాలతో సత్కరించి ఘనంగా గౌరవించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, విశ్వాసానికి, అల్లాహ్‌కు విధేయతకు ప్రతీక అని పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మైనార్టీలకు కల్పించిన రిజర్వేషన్ల ద్వారా ఎంతోమంది ముస్లింల జీవితాల్లో మార్పు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించిన మంత్రి సురేఖ, తెలంగాణ రాష్ట్రంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఇంచెంచెర్వుపల్లిలో భారీ అగ్నిప్రమాదం..

- రూ. 15 లక్షల నష్టం
- సకాలంలో స్పందించి మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది, యువత

అక్షర దర్బార్, వెంకటాపూర్ (మే 28): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తుల అనాలోచిత చర్యల వల్ల గురువారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామ పరిసరాల్లో చెలరేగిన మంటలు ఈదురుగాలులకు వేగంగా వ్యాపించి వందల ఎకరాల వ్యవసాయ భూములను అగ్నికి ఆహుతి చేశాయి. ఈ ప్రమాదంలో ఐదు ఎకరాల వరి పంట పూర్తిగా దగ్ధమవగా, మూడు బోర్ మోటార్లు, పైపులు, వందల సంఖ్యలో వరిగడ్డి కట్టలు కాలి బూడిదయ్యాయి. మంటలు గ్రామం వైపు విస్తరిస్తుండటంతో అప్రమత్తమైన విలేజ్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ కామా అశోక్ వెంటనే 100 నంబర్‌కు మరియు ఫైర్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని గ్రామ యువకులు, రైతుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గ్రామస్తులు సమయానికి స్పందించకపోయి ఉంటే ఇళ్లు కూడా కాలిపోయి భారీ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ. 15 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన వడ్లు కాలిపోవడంతో రైతులు బోరుమంటున్నారని, తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కామా అశోక్ కోరారు.

సమగ్ర సంక్షేమ కార్డు

- తద్వారా ఒకేచోట ప్రతి పౌరుడి సంక్షేమ ప్రొఫైల్
- అన్ని శాఖల నుంచి లబ్దిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్) రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్టులు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వార్డు సభ్యుడి ఓటమి కక్ష

- ముందస్తు ప్లాన్‌తో ఇంటిపై దాడి
- ఇద్దరిపై కేసు నమోదు చేసిన శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్

అక్షర దర్బార్, శాయంపేట (మే 28): శాయంపేట మండల కేంద్రంలో పాత కక్షల నేపథ్యంలో ఒక ఇంటిపై ముందస్తు పథకం ప్రకారం దాడి చేసి దంపతులను గాయపరిచిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జె. పరమేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిందం రవి తన ఇంటి ముందు నిలబడి ఉండగా, స్థానికులైన మారపెల్లి సుమన్, మారపల్లి రాహుల్ కారులో అక్కడికి వచ్చారు. కారు దిగిన మారపెల్లి సుమన్.. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తాను వార్డు సభ్యుడిగా పోటీ చేసినప్పుడు చిందం రవి కుటుంబం వ్యతిరేకంగా ఓట్లు వేయించి ఓడించిందని నానా బూతులు తిట్టాడు. అనంతరం తన చేతిలోని ఐరన్ రాడ్‌తో చిందం రవిపై దాడి చేయగా, అతడు భయపడి ఇంట్లోకి వెళ్లాడు. నిందితులు ఇద్దరూ ఇంట్లోకి చొరబడి రవిని పట్టుకుని ముఖం, ఛాతి, మెడపై పిడిగుద్దులు గుద్ది, కిందపడేసి కాళ్లతో తొక్కారు. దాడిలో రవి ముక్కు నుంచి రక్తం కారడంతో పాటు ఎడమ కన్నుకు తీవ్ర గాయమైంది. భర్తను కాపాడబోయిన భార్య నిర్మలను కూడా నిందితులు బూతులు తిడుతూ, త్వరలోనే మీ కుటుంబం మొత్తాన్ని చంపుతామని బెదిరించి పరారయ్యారు. బాధితుడు చిందం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమన్, రాహుల్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జె. పరమేశ్వర్ వివరించారు.

బీజేపీ కార్యకర్తల మృతుల కుటుంబాలకు కీర్తి రెడ్డి పరామర్శ

అక్షర దర్బార్, శాయంపేట (మే 28): శాయంపేట మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యుడు బాసని నవీన్ తండ్రి బాసని బిక్షపతి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి గురువారం పరామర్శించారు. అలాగే మైలారం గ్రామంలో బీజేపీ బూత్ అధ్యక్షుడు కన్నబోయిన రమేష్ అమ్మమ్మ బొంతల ఎల్లమ్మ మరియు మోతే జనయ్య ఇటీవల మృతి చెందగా, వారి నివాసాలకు వెళ్లి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రాయరాకుల మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటికొండ రవికిరణ్, మండల అధ్యక్షుడు రామకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, కార్యదర్శి మేకల సుమన్, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

జూన్ 4 డెడ్ లైన్

ఆలోగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు పూర్తి చేయాలి

- గన్నీ సంచుల కొరత లేదు.. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం
- తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొంటాం.. మిల్లర్లు కటింగ్ పెడితే కఠిన చర్యలు
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష

అక్షరదర్బార్, హనుమకొండ : ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జూన్ 4వ తేదీలోగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాల ధాన్యం కొనుగోలు అంశంపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జూన్ 4వ తేదీ తర్వాత వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, జూన్ 3వ తేదీ నాటికే కొనుగోళ్లు పూర్తి కావాలని కలెక్టర్లకు సూచించారు.

లారీల మళ్లింపు

ధాన్యం రవాణా వేగవంతం చేసేందుకు ఇసుక రవాణాకు వినియోగిస్తున్న లారీలను తాత్కాలికంగా ధాన్యం తరలింపునకు మళ్లించాలని, అవసరమైతే డీసీఎంలను రిక్విజిషన్ చేయాలని ఎస్పీలు, ఆర్టీఏ అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బంది కలిగించేలా తాలు, తరుగు పేరుతో కోతలు విధించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకే కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8.5 లక్షల మంది రైతులకు రూ.10,500 కోట్ల చెల్లింపులు చేశామని, ఈ యాసంగిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ఒక్క గింజ కూడా మిగలకుండా చూడాలి

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆర్డీవోలు, సివిల్ సప్లై, రవాణా, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతులు పండించిన ఒక్క గింజ కూడా మిగలకుండా కొనుగోలు చేసే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని, తాలు–తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే తహసీల్దార్లు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాల మధ్య గోదాముల కేటాయింపుల విషయంలో పౌర సరఫరాల కమిషనర్‌తో కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలన్నారు.

ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులు

జనగామ జిల్లా పరిధిలోని ఐదు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరుగుతోందని, రవాణాను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని స్టేషన్ ఘనపురం ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. శాయంపేట మండలంలో ఇప్పటివరకు లక్ష మెట్రిక్ టన్నుల లిఫ్టింగ్ పూర్తయిందని, మిగిలిన 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా త్వరగా తరలించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. లారీల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు మిల్లులకు తరలించేలా చూడాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మహిళా సంఘాలకు గోదాముల కేటాయింపునకు ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.

చివరి దశకు కొనుగోళ్లు

హనుమకొండ కలెక్టర్ చాహాట్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలో 80 శాతం ధాన్య సేకరణ పూర్తయింది. మొత్తం 154 కేంద్రాల్లో ఇప్పటికే 100 కేంద్రాలు ముగింపు దశకు వచ్చాయి. మిగిలిన వాటిలో జూన్ 4 లోగా పూర్తి చేస్తాం. ఇప్పటివరకు రైతులకు రూ. 273 కోట్లు చెల్లించామని అన్నారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. 97 శాతం షిఫ్టింగ్ పూర్తయింది. బక్రీద్ పండుగ ఉన్నప్పటికీ ప్రతి కొనుగోలు కేంద్రానికి వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అంతకుముందు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలకు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ ధార కవిత, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల రవాణా సమస్యలపై మంత్రులతో ఎమ్మెల్యే గండ్ర చర్చ

- త్వరగా మిల్లులకు తరలించేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి

అక్షర దర్బార్, శాయంపేట (మే 28): హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడీఓసీలో వరి ధాన్యం కొనుగోళ్లపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి నలమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి జిల్లాకు చెందిన శాసనసభ్యులతో పాటు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. శాయంపేట మండలంలోని గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర

రవాణా సమస్యలు (లారీల కొరత) ఉన్నాయని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించేలా సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలని మంత్రులను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు

○ రైతులు సద్వినియోగం చేసుకోవాలి: ఏఓ పోరిక జైసింగ్

అక్షర దర్బార్, నడికూడ (మే 28): రాబోయే వానాకాలం–2026 సాగు సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట సాగుకు అవసరమైన జీలుగ విత్తనాలు నడికూడ మండలంలోని నార్లపూర్ గ్రామంలో గల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ మొత్తం 150.30 క్వింటాళ్ల జీలుగ విత్తనాల నిల్వలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 30 కిలోల బరువు గల ఒక జీలుగ విత్తన సంచి అసలు ధర రూ. 4,905 కాగా, ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం సబ్సిడీతో రైతులు కేవలం రూ. 2,452.50 మాత్రమే చెల్లించి పొందవచ్చని వివరించారు. ఒక సంచి విత్తనాలు రెండున్నర ఎకరాల పొలం సాగుకు సరిపోతాయన్నారు. ఈ విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో కేంద్రానికి వచ్చి, ఈ సబ్సిడీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోరిక జైసింగ్ కోరారు.

ఐకేపీ, వీఓఏల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతు

○ రెండేళ్లయినా సమస్యలు పట్టించుకోని మంత్రి సీతక్క

○ బండ శ్రీకాంత్ పటేల్

అక్షర దర్బార్, మల్హర్ (మే 28): మల్హర్ మండల మహిళా సమైక్య సంఘం (ఐకేపీ/వీఓఏ) సభ్యుల న్యాయమైన డిమాండ్లకు బీజేపీ మండల శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్ పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీఓఏల డిమాండ్లకు అసెంబ్లీలో మద్దతు తెలిపిన ప్రస్తుత మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఇప్పుడు అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా వారి సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొంటూ తక్కువ వేతనానికి పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కనీస వేతనం రూ. 20,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఓఏల పక్షాన బీజేపీ ఎల్లవేళలా పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు వెన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, గంగాధరి సమ్మయ్య, ఉపాధ్యక్షులు తోటపల్లి తిరుపతిరెడ్డి, వేమునూరు సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలి

○ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య డిమాండ్

అక్షర దర్బార్, చిట్యాల (మే 28): చిట్యాల మండల కేంద్రంలో హనుమాన్ టెంపుల్‌కు ఎదురుగా, ప్రభుత్వ గోదామును ఆనుకొని ఉన్న ఎనిమిది గుంటల ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసిన వారి నుండి కాపాడాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. కబ్జాదారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇదే ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానంగా నిర్మించిన గోదాము సైతం పూర్తిగా శిథిలమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ప్రభుత్వ గోదాముకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించి, దానిని తక్షణమే స్థానిక రైతుల వినియోగంలోకి తేవాలని పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్న ముస్లింలు

అక్షర దర్బార్, చిట్యాల (మే 28): త్యాగం, ప్రేమ, దైవభక్తికి ప్రతీకయిన బక్రీద్ పండుగ వేడుకలను చిట్యాల మండల కేంద్రంలో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కౌసర్ ఏ మజీద్ ఆవరణలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక నమాజ్ చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు, ఆప్యాయతలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కోఆప్షన్ సభ్యుడు మొహమ్మద్ రాజ్ మహమ్మద్ మాట్లాడుతూ.. ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగ త్యాగానికి, దైవచింతనకు నిదర్శనమన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన చిట్యాల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్ఐ) పోచంపల్లి సతీష్ ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు సమాజంలో గొప్ప సంస్కృతిని, ఐక్యతను చాటుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అజమత్మియా, కార్యదర్శి హైదర్భాషా, వైస్ ప్రెసిడెంట్ షఫీ, జాయింట్ సెక్రెటరీ అక్బర్, ట్రెజరర్ షేక్ హుస్సేన్, కమిటీ సభ్యులు ఆటో అంకుష్, జలీల్, అశ్మతావలి, అల్లి పాషా, ఆరిఫ్, తిరుమలాపురం, నవాబుపేట గ్రామాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

పరకాలలో ఘనంగా ఈద్-ఉల్-అజ్హా వేడుకలు

ముస్లింలతో కలిసి నమాజ్ చేసిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

అక్షరదర్బార్, పరకాల (మే 28): పరకాల పట్టణంలోని ఈద్గా ప్రాంగణంలో బక్రీద్ పర్వదిన వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి సామూహిక ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ త్యాగానికి, కరుణకు ప్రతీక అని, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం గంగా–జమునా తెహజీబ్‌కు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. యువత స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలు, మహిళలకు వన్‌టైమ్ ఆర్థిక సాయం, వెనుకబడిన వర్గాలకు గ్రాంట్లు, వాహనాలు అందించడంతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లింలు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో సోదరభావంతో బక్రీద్ వేడుకలు

○ మసీదులకు విద్యుత్ అలంకరణ..

○ బందోబస్తు పర్యవేక్షించిన ఎస్సై ఎం. సురేష్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి (మే 28): మొగుళ్లపల్లి మండల వ్యాప్తంగా బక్రీద్ పండుగ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ ప్రవక్త ఇబ్రహీం అచంచలమైన భక్తికి, త్యాగనిరతికి ప్రతీక అని కొనియాడారు. ముస్లింలు ఉదయమే నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలో సామూహిక నమాజ్ చేశారని, అనంతరం సాంప్రదాయబద్ధంగా ఖుర్బానీ ఇచ్చి ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి పేదలకు, బంధువులకు పంపిణీ చేసి దాన ధర్మాలు చేశారన్నారు. స్థానిక మత పెద్దలు మాట్లాడుతూ.. కేవలం జంతుబలి మాత్రమే కాకుండా మనలోని స్వార్థం, అహంకారాన్ని త్యాగం చేసి తోటివారికి ప్రేమతో సహాయం చేయడమే నిజమైన పండుగ సందేశమన్నారు. పండుగను పురస్కరించుకొని మండలంలోని మసీదులను విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. మొగుళ్లపల్లి ఎస్సై ఎం. సురేష్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలందరూ సోదరభావంతో పండుగ జరుపుకోవాలని ఎస్సై సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎండి రఫీ, యూసుఫ్ పాషా, రషీద్ భాష, ఉస్మాన్, అబ్దుల్ రహీం, సుకూర్, అబ్దుల్ నబీ, సర్వర్ హుస్సేన్, జిలాని పాల్గొన్నారు.

పంట వ్యర్థాలను కాల్చితే చట్టపరమైన చర్యలు తప్పవు

అక్షర దర్బార్, వెంకటాపూర్ (మే 28): పంట పొలాల్లో వరి కొయ్యలు, ఇతర వ్యవసాయ వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల జరిగే ప్రమాదాలకు కారణమైన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వెంకటాపూర్ ఎస్సై చల్లా రాజు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం తగ్గడమే కాకుండా, పక్కనే ఉన్న విద్యుత్ మోటార్లు, గడ్డివాములు తగలబడి రైతులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందన్నారు. అలాగే వేసవి వడగాల్పులతో ఈ మంటలు రోడ్ల వైపు వేగంగా వ్యాపించి, పొగ కారణంగా వాహనదారులకు తీవ్ర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రైతులు వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్ని సేంద్రియ ఎరువుగా వాడుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్సై చల్లా రాజు స్పష్టం చేశారు.

అక్షర దర్బార్

త్రివేణి సంగమంలో భక్తుల జనసందోహం

కాళేశ్వరంలో 'సరస్వతి అంత్య పుష్కర వైభవం

- దేశంలోనే రెండో చోట సరస్వతి పుష్కరాల నిర్వహణ
- కాశీ పండితుల నవరత్న మాలా హారతికి భక్తులు ముగ్ధులు
- జూన్ 1తో ముగియనున్న వేడుకలు.. కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణ

అక్షరదర్బార్, కాళేశ్వరం : సరస్వతి అంత్య పుష్కరాలతో దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరం క్షేత్రం సరికొత్త కాంతులీనుతోంది. కనీవిని ఎరగని స్థాయిలో దేశం నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులు త్రివేణి సంగమంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. శతాబ్దాలుగా సరస్వతి నదికి పుష్కరాలు జరుపుకునే ఆనవాయితీ ఉన్నప్పటికీ, అధికారికంగా మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం వీటిని నిర్వహించడం ఇదే తొలిసారి. ఉత్తరాదిన ప్రయాగరాజ్ (అలహాబాద్) తర్వాత, దేశంలోనే రెండో ప్రాంతంగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాల సాంప్రదాయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం విశేషం.

కిక్కిరిసిన నదీతీరం.. ఆధ్యాత్మిక శోభ

గత మే 21న ప్రారంభమైన ఈ అంత్య పుష్కరాలు గురువార నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. రోజు రోజుకూ భక్తుల సంఖ్య రెట్టింపు అవుతుండటంతో సంగమ తీరమంతా జనసందోహంగా మారింది. వేకువజాము నుంచే భక్తులు నదికి చీరె, సారె సమర్పించడం, సైకత లింగాలకు ప్రత్యేక పూజలు చేయడం, వేద పండితుల మంత్రోచ్చారణలతో కాళేశ్వరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భారతీయ సాంప్రదాయం ప్రకారం, పితృదేవతలను స్మరించుకుంటూ భక్తులు ఇక్కడ పెద్ద ఎత్తున తీర్థవిధి, పిండప్రదానాలు నిర్వహిస్తున్నారు.

ఆన్ లైన్, టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాలు

పుష్కరాల్లో అత్యంత ఆకర్షణీయంగా నిలుస్తున్న "సరస్వతి నవరత్న మాలా హారతి"ని భక్తులు ఎక్కడి నుంచైనా వీక్షించేలా భాషా సాంస్కృతిక, సమాచార పౌర సంబంధాల శాఖల ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారాలు ఏర్పాటు చేశారు.

కాశీ పండితుల 'నవరత్న మాలా హారతి' అద్భుతం

పుష్కర వేడుకల్లో ప్రతిరోజూ రాత్రి వేళ త్రివేణి సంగమ తీరాన భారీ సెట్టింగులు, విద్యుత్ వెలుగుల నడుమ నిర్వహిస్తున్న నదీ హారతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కాశీ క్షేత్రం నుంచి వచ్చిన ప్రత్యేక పండితులు ఈ 45 నిమిషాల హారతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పుష్కరాలు ముగియడానికి ఇంకా నాలుగు రోజులే సమయం ఉన్నందున, భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని, జిల్లా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

గర్భాలయంలో 'కర్పూర హారతి'.. మారుమ్రోగిన శివనామస్మరణ

గురువారం కాళేశ్వరం ఆలయంలో ఒక అపూర్వ ఘట్టం చోటుచేసుకుంది. నదీ హారతి ఇస్తున్న కాశీ పండితులు, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధిలోని గర్భాలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో 'కర్పూర హారతి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా "హర హర మహాదేవ.. శంభో శంకర" అనే శివనామస్మరణతో మారుమ్రోగింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు ఈ కర్పూర హారతి వైభవాన్ని వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. జూన్ 1వ తేదీతో ఈ అంత్య పుష్కరాలు ముగియనున్నాయి.

అంతరించిపోతున్న చిందు యక్షగానాన్ని కాపాడండి

- ప్రభుత్వ సాయం కోసం కళాకారుడు గడ్డం ధనంజయ వినతి

అక్షర దర్బార్, చిట్యాల (మే 28): ఆధునిక కాలంలో వస్తున్న మార్పుల వల్ల ప్రాచీన చిందు యక్షగాన కళలు, కళాకారులు అంతరించిపోతున్నారని, వారిని ఆదుకుంటూ సంస్కృతిని కాపాడాలని చిందు యక్షగాన కళాకారుడు గడ్డం ధనంజయ ప్రభుత్వాన్ని కోరారు. చిట్యాల మండలం తిర్మలాపూర్ గ్రామంలో గత ఐదు రోజులుగా గడ్డం ధనంజయ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాత ముత్తాతల వారసత్వంగా వస్తున్న ఈ వీధి నాటకాలను వేస్తూ, ఇళ్లను వదిలేసి జిల్లాల సరిహద్దులు దాటుకుంటూ సంచార జీవితాన్ని గడుపుతున్నామన్నారు. పురాణ ఇతిహాసాలను రంగస్థలంపై అద్భుతంగా ప్రదర్శిస్తూ

పాటలు, దరువులు, డప్పు, తాళం, మద్దెల వంటి సాంప్రదాయ వాయిద్యాలను వాడుతామన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే ఎన్నో ప్రదర్శనలు ఇచ్చామని, నేడు ఆదరణ తగ్గి జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంప్రదాయ కళను బతికించడానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గడ్డం నీలకంఠం, రాజేశ్వర్, కనకయ్య, శంకర్, పెద్ద సమ్మయ్య, గడ్డం శంకర్, సంజీవ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ అగ్నిపర్వతం

మానుకోట రాళ్ల దాడికి 16 ఏళ్లు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి (మే 28): తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రలో మైలురాయిగా నిలిచిన మహబూబాబాద్ (మానుకోట) 'రాళ్ల దాడి' ఘటన జరిగి నేటితో 16 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమం ఉధృతంగా సాగుతున్న 2010 మే 28న, తెలంగాణకు వ్యతిరేకంగా సమైక్యవాద నాయకులు మానుకోటలో సభ నిర్వహించడానికి ప్రయత్నించారు. దీనిని నిరసిస్తూ జేఏసీ నాయకులు, విద్యార్థి సంఘాలు, ప్రజలు భారీగా తరలివచ్చి సభను అడ్డుకున్నారు. ఆ సమయంలో సమైక్యవాద నాయకుల గన్‌మెన్లు, పోలీసులు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో 15 మంది ఉద్యమకారులు తీవ్రంగా గాయపడ్డారు. తుపాకీ గుళ్లకు భయపడకుండా, చేతిలో ఎలాంటి ఆయుధాలు లేకపోయినా ఉద్యమకారులు సమీపంలోని రైల్వే ట్రాక్ నుండి కంకర రాళ్లను సేకరించి ఎదురు

దాడి చేశారు. వర్షంలా కురిసిన రాళ్ల దెబ్బకు సమైక్యవాద నాయకులు అక్కడి నుండి పలాయనం చిత్తగించారు. ఈ ఘటన తెలంగాణ ప్రజల తెగింపును ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసింది. స్వచ్ఛందంగా ఎగసిన ఈ ప్రజా ఉద్యమ స్ఫూర్తితో బంగారు తెలంగాణను నిర్మించుకోవడమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి అని ఉద్యమకారులు స్మరించుకున్నారు.